

విద్యుత్ షాక్‌తో చిరుత మృతి
విద్యుత్ షాక్‌తో చిరుత పులి మృతి చెందిన విషయాన్ని గోప్యంగా ఉంచిన రైతుపై కేసు నమోదు చేసినట్లు ప్రొద్దుటూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అశోక్ కుమార్ తెలిపారు. -8లో



ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన
వెల్లటూరు గ్రామ పొలాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను బుధవారం జర్మన్ దేశానికి చెందిన బృందం సభ్యులు పరిశీలించారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.8/17.9

వాతావరణం
జిల్లాలో బుధవారం 17.9 - 34.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం
కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతుల్లో చదువుతున్న విద్యార్థులకు, జెడ్పీ, కేజీబీవీ, మోడల్, మున్సిపల్ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 6 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్ష పరిరక్షణ పథకం కింద కరాటే లేదా టైక్వాండో వంటి యుద్ధ కళల్లో శిక్షణ ఇచ్చేందుకు రిజిస్టర్ అయిన సొసైటి లేదా ట్రస్టు నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు తెలిపారు. దరఖాస్తు చేసుకునే సొసైటీ లేదా ట్రస్టుకు యుద్ధకళల్లో 2024 మార్చి 31వ తేదీ నాటికి కనీసం 3 ఏళ్లు ఉనికిలో ఉండాలని తెలిపారు. సంబంధిత శిక్షణను ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు 20 సెషన్స్ కింద శిక్షణ ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల సంస్థలు పూర్తి చేయబడిన దరఖాస్తులను ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమగ్రశిక్ష కడప కార్యాలయంలో సమర్పించాలని ఏపీసీ తెలిపారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక బస్సు సర్వీసు
ప్రొద్దుటూరు: మహాకుంభమేళాకు ప్రొద్దుటూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 1 గంటకు సూపర్ లగ్జరీ బస్సు బయల్దేరుతుందని ఆయన పేర్కొన్నారు. అన్నవరం, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, పూరి, గయా, బుద్ధగయ, అయోధ్య, వారణాసి, ప్రయాగ తిరిగి పిఠాపురం, సామర్లకోట, విజయవాడ కనకదుర్గ ప్రొద్దుటూరుకు చేరుతుందని వివరించారు. పది రోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భోజన సదుపాయం కలదని, సూపర్ లగ్జరీ బస్సు టికెట్ రానుపోను రూ.13,500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల వారు 9966525210, 7382867512 ఫోన్ చేసి టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు
కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుపతి నుంచి వైఎస్సార్ జిల్లా మీదుగా కుంభమేళాకు రెండు ప్రత్యేకరైళ్లు నడపనున్నారని కడపరైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 07117 నెంబరుగల తిరుపతి–ధనాపూర్ రైలు ఈనెల 14న బయలుదేరుతుందని పేర్కొన్నారు. అలాగే 18న 07119 నెంబరుగల రైలు తిరుపతిలో బయలుదేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ధనపూర్‌లో 07118 నెంబరుగల రైలు ఈనెల 17న, అలాగే 07120 నెంబరుల రైలు ఈనెల 21న రైలు బయలుదేరుతుందన్నారు. ఈ రైలు తిరుపతి, రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, మహబూబ్‌నగర్, కాచిగూడ, మల్కాజ్‌గిరి, మౌలాలి, ఖాజీపేట జంక్షన్, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, నాగపూర్, హిటార్సి, జబల్‌పూర్, ప్రయాగరాజ్, మీరజ్‌పూర్‌మీదుగా ధనాపూర్‌కు చేరుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సామాన్యుడికి సర్దుపోటు



❒ కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన చెన్నకేశవరెడ్డి సర్వీసు నెంబర్ 211410052990 ద్వారా 132 యూనిట్లు విద్యుత్ వాడారు. బిల్లు రూ.459 వచ్చింది. అయితే ఫిక్స్‌డ్ చార్జీస్ రూ.20, కస్టమర్ చార్జీ రూ.50, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.7.92, ఎఫ్‌పీపీసీఏ 2022–06 చార్జీ రూ.163.64, ఎఫ్‌పీపీసీఏ 2023–05 చార్జీ రూ.129.22, ఎఫ్‌పీపీసీఏ 2025–01 చార్జీ రూ.52.80, ట్రూఅప్ చార్జీ రూ.100.42 కలిపి మొత్తంగా రూ.983 విద్యుత్ బిల్లు వచ్చింది. అసలు విద్యుత్ చార్జీ రూ.459 అయితే కొసరు చార్జీ రూ.524 భరించాల్సి వస్తోంది.

❒ కడప నగరం పటేల్ రోడ్డులోని హరీష్ కుమార్‌రెడ్డి సర్వీసు నెంబర్ 2114101111391 ద్వారా 137 యూనిట్లు విద్యుత్ వాడుకున్నారు. అందుకు రూ.489 బిల్లు వచ్చింది. ఫిక్స్‌డ్ చార్జీస్ రూ.20, కస్టమర్ చార్జీ రూ.50, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.8.22, ఎఫ్‌పీపీసీఏ 2022–06 చార్జీ రూ.175.95, ఎఫ్‌పీపీసీఏ 2023–05 చార్జీ రూ.227.84, ఎఫ్‌పీపీసీఏ 2025–01 చార్జీ రూ.68, సర్‌చార్జీ రూ.25, ట్రూ అప్ చార్జీ రూ.39 కలిపి మొత్తం రూ.1103 బిల్లు వచ్చింది. విద్యుత్ చార్జీ కేవలం రూ.489 అయితే, అదనపు చార్జీలు రూ.614 భరించాల్సి వచ్చింది.

☛ **వినియోగదారులందరిదీ ఇదే పరిస్థితి.**




చంద్రన్న సర్కార్‌లో బాదుడే...బాదుడు
- సర్దుపోటు పేరుతో కరెంటు చార్జీల మోత
- విద్యుత్ టారీఫ్ కంటే ఎక్కువగా అదనపు చార్జీల మొత్తం
- నెల నెలా విద్యుత్ బిల్లు నుంచి రూ.15.1కోట్లు వసూలు

సాక్షి ప్రతినిధి, కడప: అవే లైట్లు...అదే టీవీ... రిఫ్రిజిరేటర్.. ఫ్యాన్లు.. అన్నీ గతంలో ఉన్న విద్యుత్ ఉపకరణాలే... ఆపై చలికాలం... విద్యుత్ వినియోగం తక్కువలో తక్కువ. కేవలం 137 యూనిట్లే వాడకం. అయినా బిల్లు మాత్రం రూ.11 వందల పైబడి వచ్చింది. ఇదేంటబ్బా అమాంతం ఇంత బిల్లు వచ్చిందేమిటి... ఆరా తీస్తే ఇదంతా కూటమి సర్దుపోటు మహిమగా తేలింది. అసలు కన్నా కొసరు ఎక్కువగా వసూలు చేస్తూ సర్కార్ షాక్ ఇస్తోందని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెలా రూ.15కోట్లు తెలియకుండానే వసూళ్లు
జిల్లా వాసులపై కూటమి ప్రభుత్వం భారీ విద్యుత్ చార్జీల భారం మోపింది. జిల్లాలో మొత్తం 8,89,907 విద్యుత్ కనెక్షన్లున్నాయి. ప్రతినెలా రూ.15కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం వసూలు చేయడం ప్రారంభించింది. ప్రతి యూనిట్‌కు 61పైసలు చొప్పున అదనపు భారం మోపింది. ఎఫ్‌పీపీసీఏ చార్జీలను యూనిట్‌కు రూ.1.21లు ఒకేసారి కాకుండా ఈనెల 61 పైసలు, మరో నెల 60పైసలు చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. దీంతో ఈనెల బిల్లులో గతంలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి యూనిట్‌కు 61పైసలు చొప్పున డిసెంబర్ నుంచి బిల్లులో వినియోగదారులకు వడ్డించారు. జిల్లా పరిధిలో ప్రతి నెల అదనంగా రూ.15.10కోట్లకు పైగా వసూలు చేస్తున్నారు. ఆపై తర్వాత నెల 60పైసలు చొప్పున రూ.10కోట్లకుపైగా వసూలు చేయనున్నారు. జనవరి బిల్లులో సుమారు రూ.16కోట్లు అదనపు భారాన్ని వినియోగదారులు భరించాల్సి వచ్చింది. మొత్తంగా జిల్లాలో వినియోగదారుడికి తెలియకుండానే సుమారు రూ.40కోట్లు పైబడి విద్యుత్‌శాఖ వసూళ్లు చేయడం గమనార్హం.

▸▸ ప్రతినెలా విద్యుత్ ఘాతం
ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ) కింద ఇప్పటికే జిల్లా ప్రజలపై కూటమి ప్రభుత్వం కోట్లలో భారం మోపింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన సర్దుబాటు పేరుతో ప్రతినెలా వడ్డనకు ప్రయత్నాలు చేస్తున్నారు. సర్దుబాటు చార్జీలకు తోడుగా అక్టోబర్ నెల నుంచి ఏ నెలకు ఆనెల సర్దుబాటు పేరుతో యూనిట్‌కు 91 పైసలు చొప్పున భారం వేస్తున్నారు. ఇలా ప్రతినెలా సుమారు రూ.15 కోట్లను వసూలు చేయనున్నట్లు విద్యుత్ అధికారుల గణాంకాలు వివరిస్తున్నాయి. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఊరువాడ చెప్పుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాజాగా వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. ఓవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల మరోవైపు విద్యుత్ చార్జీలు పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.





బిల్లు రూ. 500 పెరిగింది



కరెంటు ఛార్జీలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. నా వరకే కరెంటు బిల్లు రూ. 400–500 పెరిగింది. కరెంటు బిల్లులు ఇంతలా పెరుగుతాయని ఊహించలేదు. ప్రభుత్వం వెంటనే కరెంటు బిల్లులను తగ్గించాలి.
– గంగాధర్‌రెడ్డి, ఐటీఐ సర్కిల్, కడప

పెనుభారమే



విద్యుత్ చార్జీలు పెంచి మధ్యతరగతి ప్రజలపై ఈ ప్రభుత్వం పెను భారం మోపుతోంది. ఎన్నికల సమయంలోనేమో కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం. గతంలో ఐదారువందలు వచ్చే బిల్లు ఇప్పుడు రూ.900 నుంచి రూ.1000 వరకు వస్తోంది. పిల్లల చదువులు, ఇంటి ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న మాపై ఇలా అదనపు భారం మోపడం అన్యాయం.
– జి.రామరాజు, బద్వేలు

మాలాంటి పేదోళ్లకు ఇబ్బంది



కూలీ నాలీ చేసుకుని జీవించే మాలాంటి పేదోళ్లకు ఎక్కువగా వస్తున్న కరెంటు బిల్లులు కట్టాలంటే ఇబ్బందిగా ఉంది. అసలే పనులు లేక కుటుంబ పోషణకు, పిల్లల చదువులకు డబ్బులు సమకూర్చేందుకు కష్టంగా ఉన్న సమయంలో ఇలా కరెంటు బిల్లులకు వందలాది రూపాయలు చెల్లించాలంటే కష్టంగా ఉంది.
–పి.జయమ్మ, బద్వేలు

నేడు బాస్కెట్ బాల్ ఎంపికలు
కడప ఎడ్యుకేషన్: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బాలబాలికల బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి తెలిపారు. ఇందులో బాలురకు వేంపల్లి చైతన్య హైస్కూల్లో సాయంత్రం 3 గంటలకు, అలాగే బాలికలకు కడప నగరం జయనగర్‌కాలనీలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో సాయంత్రం 4 గంటలకు జిల్లాస్థాయి యూత్ బాలబాలికల బాస్కెట్ బాల్ ఎంపికలు జరుగుతాయని వివరించారు. ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు జనవరి 1వ తేదీ 2009 తర్వాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. బాస్కెట్‌బాల్ ఎంపికలకు హాజరయ్యే వారికి ఒరిజినల్ ఆధార్‌కార్డు కలిగి ఉండాలని సూచించారు.

8 వరకు దరఖాస్తుల స్వీకరణ
కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన గీత కులాల మద్యం దుకాణాలకు ఈ నెల 8 లోపల దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 14 గీత కులాలకు మద్యం దుకాణాలను కేటాయించిందన్నారు. అందులో కడప–ఈడిగ, ప్రొద్దుటూరు –ఈడిగ, మైదుకూరు– ఈడిగ, పులివెందుల –గౌడ్, బద్వేలు–ఈడిగ, వీఎన్‌పల్లె –గౌండ్ల, ప్రొద్దుటూరు రూరల్–ఈడిగ, పెద్దముడియం–గౌడ్, సీకేదిన్నె –గౌడ, చక్రాయపేట– ఈడిగ, కాశినాయన–ఈడిగ, వేముల–గౌడ్, వల్లూరు, ఈడిగ, ఖాజీపేట –గౌడ్ కులాలకు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో దరఖాస్తు రుసుం రూ. 2లక్షలుగా నిర్ణయించబడిందన్నారు. లైసెన్స్ ఫీజు 50 శాతంగా నిర్ణయించబడిందన్నారు. జిల్లాలో 14 దుకాణాలకు గాను 30 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులను ఈ నెల 8 తేదీ సాయంత్రం 5 లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10న కలెక్టరేట్ సభాభవన్‌లో కలెక్టర్ సమక్షంలో డ్రా తీస్తామని వివరించారు.



అశ్వవాహనంపై విహరిస్తున్న కడపరాయుడు

అశ్వవాహనంపై అనంతమూర్తి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కడప కల్చరల్ : దుష్ట సంహారం చేసేందుకు ఆయన ఖడ్గం చేతబూనాడు. ఉరకలేస్తున్న సమరోత్సాహంతో ఉత్తమ అశ్వంపై వేటకు బయలుదేరాడు. ఆ వీర గంభీర రూపం శత్రువులకు చూడగానే దడపుట్టించేలా ఉంది. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామిని సర్వభూపాల వాహనంలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య ఆధ్వర్యంలో అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉల్లాసభరితంగా ఊయల సేవను నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు రాత్రి కనుల పండువగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఆ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పులకించిపోయారు.

నేడు చక్రస్నానం: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వసంతోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయం ఎదుట గల పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నారు. సాయంత్రం ఊంజల్ సేవ ఉంటుంది.

కొత్త పాలకవర్గం ఎప్పుడో!

- ఏఎంసీల రిజర్వేషన్లపై కొనసాగుతున్న కసరత్తు
- రిజర్వేషన్ల ప్రకారమా లేక పాత పద్ధతిలోనే కమిటీలు ఏర్పాటు చేస్తారా?
- ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా భర్తీ కాని పదవులు
- ఏఎంసీల పదవుల భర్తీ కోసం ఎదురు చూస్తున్న ఆశావహులు



కడప వ్యవసాయ మార్కెట్ కమిటీ మార్కెట్‌యార్డు

కడప అగ్రికల్చర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల నూతన పాలకవర్గం ఏర్పాటుపై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. మరోవైపు కొత్త పాలక వర్గాన్ని ఏర్పాటు చేస్తే తమకు పదవులు లభిస్తాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న పలువురు ఆశావహులకి నిరాశే ఎదురవుతోంది. తాజాగా ఏఎంసీల రిజర్వేషన్ ప్రక్రియకు సంబంధించిన కసరత్తు చేయమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల అంశం తెరపైకి వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్ పద్ధతి అమలు చేసి మహిళలకు పెద్దపీట వేసిన విషయం విదితమే. ప్రస్తుత కూటమి ఎమ్మెల్యేలు రిజర్వేషన్ పద్ధతి వద్దని ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. దీనికి జిల్లా కలెక్టర్ నో అన్నట్లు సమాచారం. ఏఎంసీలకు సంబంధించి పాత విధానం కొనసాగిస్తారా.. లేక రిజర్వేషన్లు ప్రకారం జరుపుతారా అనేది తేలాల్సి ఉంది.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్కెటింగ్ కమిటీలకు రిజర్వేషన్ విధానం తీసుకొచ్చింది. ఇందులో మహిళలకు పెద్దపీట వేసి ప్రాధాన్యత కల్పించింది. దీంతో అన్ని సామాజిక వర్గాలకు కూడా భాగస్వాములను చేసింది. ఈ రిజర్వేషన్ల విధానం అమలుకు తాజాగా కూటమి ప్రభుత్వంలో కొందరు నేతలు వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది.

తాము సిఫార్సు చేసిన వారికే....
కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు తాము సిఫార్సు చేసిన వారికే పాలకవర్గంలో చోటు కల్పించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. కాకపోతే మార్కెటింగ్‌శాఖ అధికారులు సంబంధిత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లి రిజర్వేషన్లు ఖరారు చేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ విషయంపై కలెక్టర్ దృష్టి సారించి ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలతో చర్చించినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు రిజర్వేషన్ పద్ధతి వద్దని పట్టుబట్టినట్లు సమాచారం.

ఏఎంసీ పేరు	గతంలో	2022
కడప	ఓసీ	బీసీ ఉమెన్
బద్వేల్	ఓసీ ఉమెన్	బీసీఉమెన్
ఎర్రగుంట్ల	ఎస్టీ ఉమెన్	బీసీ ఉమెన్
జమ్మలమడుగు	ఓసీ	ఓసీ జనరల్
మైదుకూరు	ఎస్సీ ఉమెన్	ఓసీ జనరల్
కమలాపురం	ఓసీ	ఓసీ జనరల్
సింహాద్రిపురం	–	ఓసీ జనరల్
పొద్దుటూరు	బిసి ఉమెన్	ఓసీ ఉమెన్
పులివెందుల	ఎస్సీ	ఎస్సీ
సిద్దవటం	ఓసీ ఉమెన్	ఎస్సీ ఉమెన్

» జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలు
జిల్లాలో పది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి, ఇందులో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, కమలాపురం, సిద్దవటం, ఎర్రగుంట్ల, పులివెందుల, సింహాద్రిపురం ఉన్నాయి. ప్రతి వ్యవసాయ మార్కెట్ కమిటీలో 15 మంది కూడిన సభ్యులు ఉంటారు. ఇందులో అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, సన్నకారు రైతులు, పశు పోషకులు, ట్రేడర్లతోపాటు కొంత మంది అధికారులు ఉంటారు. వీరితోపాటు ఆయా ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే కూడా గౌరవ సభ్యుడిగా ఉంటారు.

వారం పదిరోజుల్లో..



జిల్లాలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీల రిజర్వేషన్‌కు సంబంధించిన ఫైల్ కలెక్టర్ వద్ద ఉంది. ఆయన పరిశీలిస్తున్నారు. మరో వారం పదిరోజుల్లో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావచ్చు.
– అజాద్‌వల్లి, ఏడీ, మార్కెటింగ్‌శాఖ

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి
కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: వివిధ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పీజీఆర్ఎస్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా వెనుకబడిన వర్గాల వారికి అందిస్తున్న స్వయం ఉపాధి రుణ సహాయ సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆయా కార్పొరేషన్ల జిల్లా అధికారులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ కార్పొరేషన్, బీసీ జనరిక్ మెడికల్ షాపులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈ డబ్ల్యూ ఎస్)కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ జనరిక్ మెడికల్ షాపులు, కాపు చంద్రన్న స్వయం ఉపాధి, ఎస్సీ కార్పొరేషన్, మైనారిటీ కార్పొరేషన్, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులైన వారిని గుర్తించాలని ఎంపీడీవోలు, కమిషనర్లకు సూచించారు. ఏపీ ఓబీ ఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా ప్రకటిస్తామన్నారు. గ్రామాల్లో మండలాల్లో తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు పథకాలకు అర్హులని అన్నారు. రుణ సహాయాన్ని పొందడానికి బ్యాంకుల నిర్ధారించిన నిబంధనలను పాటించాలన్నారు. ఇందులో మహిళలకు 33 శాతం ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారులకు 30 నుంచి 50 శాతం వరకు వివిధ సెక్టార్లలో సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా 1550 యూనిట్లు, బీసీ జనరిక్ మెడికల్ షాపులు 32 యూనిట్లు, కార్పొరేషన్ ద్వారా 240 యూనిట్లు, ఈడబ్ల్యూఎస్ జనరిక్ మెడికల్ షాపులు 41 యూనిట్లు, కాపు చంద్రన్న స్వయం ఉపాధి ద్వారా 379 యూనిట్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1026 యూనిట్లు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 1723 యూనిట్లు, క్రిస్టియానిటీ మైనారిటీ ద్వారా 7 యూనిట్లు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఎనిమిది కార్పొరేషన్ల ద్వారా మొత్తం 4998 యూనిట్లకుగాను రూ 80.15 కోట్ల లక్ష్యంతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుండగా.. ఇందులో 1651 యూనిట్లు గాను రూ 20.29 కోట్లు లక్ష్యంతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే రుణ సహాయాన్ని అందించడానికి 8 కార్పొరేషన్లకు గాను బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందన్నారు. లబ్ధిదారుల ఎన్నిక పారదర్శకంగా జరగాలని, అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. అలాగే సబ్సిడీ సకాలంలో లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ నిధులను స్వాహా చేసిన అధికారులపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో స్వయం సహాయక బృందాలకు 10 నుంచి 20 లక్షల వరకు రుణ సహాయం అందించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే ప్రజా ఫిర్యాదుల పరిష్కారక వేదికలో ఇచ్చిన అర్జీ దారుని ఇంటికి వెళ్లి, అర్జీదారులతో సెల్ఫీ దిగి సమస్యను నిశితంగా పరిశీలించి పరిష్కార మార్గం అందించాలన్నారు. డ్వామా పీడీ ఆదిశేషా రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి డా.హెచ్ వెంకట సుబ్బయ్య,డి.ఆర్.డి.ఎ పిడి ఆనంద్ నాయక్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ,కడప కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, డీఎల్‌డీ ఓ సుబ్రమణ్యం, ఎల్డిఎం జనార్ధనం, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, తదితర అధికారులు హాజరయ్యారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించిన జర్మన్ బృందం


పంటలను పరిశీలిస్తున్న జర్మన్ బృందం

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామ పొలాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను బుధవారం జర్మన్‌కు చెందిన జాతీయ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధి బృందం సభ్యులు సంగీత అగర్వాల్, మార్క్ ప్రెయిన్, అన్నా బెరెజోవ్‌స్కాజాలు పరిశీలించారు. రైతు హరిప్రియ విత్తన గుళికల విధానం ద్వారా సాగు చేసిన అలసంద పంటను పరిశీలించారు. విత్తన గుళికల విధానం వల్ల విత్తనాలు ఆరు నెలల వరకు జీవంతో ఉండి తక్కువ తేమలో కూడా మొలకెత్తే సామర్థ్యం కలిగి ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారి మురళీధర్, అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివారెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్, అదనపు డీపీఎం వసంత కుమారి, రైతులు పాల్గొన్నారు.

లింగాలలో..


అరటి పంటను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

లింగాల : లింగాల మండలం అక్కులగారిపల్లె గ్రామంలో బుధవారం సంబోధిని తనిఖీలో భాగంగా ఢిల్లీ సంబోధిని వెరిఫికేషన్ బృంద సభ్యులు సాయి కుమార్, ప్రణీత్, మోహన్ రామ్ వర్మ, పద్మిని, రాము, రాణి, యాష్, సంతోజినిలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అరటి ఏ గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్‌తోపాటు ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్‌రెడ్డి, పిర్ని జయ నాయక్, ఇసీప్స్, యశోద రమణ, రవి, బాదుల్బీ, గంగా భవాని, శోభారాణి, సాహితి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు


అరెస్టు వివరాలను మీడియాకు వివరిస్తున్న ఎస్‌ఐ వెంకట సురేష్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ద్వారకానగర్‌లో ఆదివారం రాత్రి చోరీ చేసిన ఘటనలో సగబాల నాగరాజు, గడ్డం శివశంకర్, వినోద్‌లను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్‌ఐ వెంకటసురేష్ బుధవారం మీడియాకు వెల్లడించారు. ద్వారకానగర్‌లో నివాసం ఉంటున్న రమణయ్య ఈ నెల 4వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లగా నాగరాజు, శివశంకర్, వినోద్‌లు అతని ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలో ఉన్న 31.97 గ్రాముల బంగారు, రూ. 44,500 నగదును దోచుకెళ్లారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులు బైపాస్ రోడ్డులో ఉండగా బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. వీరి వద్ద ఉన్న బంగారు నగలు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు వివరించారు.

గుప్త నిధుల పేరుతో మోసం

- ఏడుగురి అరెస్టు
- మెటల్ విగ్రహం, కారు, రంగురాళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కారు, బైక్


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

ప్రొద్దుటూరు క్రైం : గుప్త నిధుల పేరుతో మోసం చేస్తున్న ఏడుగురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను బుధవారం రాత్రి పోలీసులు మీడియాకు తెలిపారు. కడపలోని అశోక్‌నగర్‌కు చెందిన ఎర్రసాని శ్రీనివాసులుతో పాటు మరో ఆరుగురు కలిసి గుప్త నిధుల పేరుతో మోసం చేసేవారు. వీరు బజారులో దొరికే విగ్రహాన్ని కొనుగోలు చేసి ఒక ప్రదేశంలో పాతిపెడతారు. పురాతన విగ్రహాలు ఇంట్లో ఉంటే మేలు జరుగుతుందని నమ్మేవారిని ఎంచుకుంటారు. గుప్త నిధులు వెలికి తీస్తామని నమ్మబలికి విగ్రహం ఉన్న ప్రదేశానికి వారిని తీసుకెళ్తారు. వారి సమక్షంలోనే పూజలు చేసి ముందే భూమిలో పాతిపెట్టిన విగ్రహం, రంగురాళ్లను బయటికి తీస్తారు. ఇలా వీటిని గుప్త నిధులుగా నమ్మించి ప్రజలకు ఇచ్చి మోసం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీపీపీ ప్రాంతంలోని రాజసాగర్ అనే వ్యక్తికి విగ్రహం, రంగురాళ్లను ఇచ్చి అతని వద్ద నుంచి రూ. 3 లక్షలు వరకూ వసూలు చేశారు. రంగురాళ్లను ఇంట్లో పెట్టి పూజిస్తే కొన్ని రోజుల తర్వాత వజ్రాలుగా మారుతాయని వారు నమ్మించేవారు.

ఆర్టీపీపీ రోడ్డులోని స్మశానంలో అరెస్టు

ప్రొద్దుటూరుకు చెందిన కొందరు వ్యక్తులను మోసం చేసేందుకు ఏడుగురు పథకం రచించారు. ఈ క్రమంలో ఆర్టీపీపీ రోడ్డులోని స్మశానం వద్ద పూజలు చేసేందుకు వెళ్లిన ఎర్రసాని శ్రీనివాసులు, వల్లూరు మండలం, కొప్పోలు గ్రామానికి చెందిన నారిగాండ్ల లక్ష్మీనారాయణ, ఎర్రగుంట్లకు చెందిన షేక్ చాంద్‌బాషా, మల్లు వెంకటరెడ్డి, ఆలూరు బాలసంజీవరాయుడు, ప్రొద్దుటూరులోని శ్రీరాంనగర్‌కు చెందిన కుంటుమల్ల మునికుమార్, చిలంకూరు గ్రామానికి చెందిన దియ్యా మధుబాబులను వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ సంజీవరెడ్డి సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మెటల్ విగ్రహం, రంగురాళ్లు, 8 సెల్‌ఫోన్లు, కారు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

డీటీసీపై విచారణ మొదలు

ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొనసాగిన విచారణ


విచారణకు హాజరైన డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

కడప వైఎస్సార్ సర్కిల్ : ఇటీవల తన కింది స్థాయి ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని అభియోగాలు ఎదుర్కొన్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిపై విచారణ మొదలైంది. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మిని విచారణాధికారిగా నియమించిన నేపథ్యంలో ఆమె ఆధ్వర్యంలోని ఐదుగురు సభ్యుల విచారణ కమిటీ బుధవారం కలెక్టరేట్‌లోని డి బ్లాక్‌లో విచారణ ప్రారంభించింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ బాధిత మహిళ, ఏఎంవీఐ శ్వేత, ఆమె భర్తను విచారించారు. మధ్యాహ్నం సెషన్‌లో 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డిని విచారించారు. ఈ సందర్భంగా విచారణ అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ విచారణ చేసేందుకు 90 రోజుల గడువు ఇచ్చారని, ఆలోపు ఇరువైపులా ఎంతమందిని విచారించాలో అందరినీ విచారణ చేస్తామని, విచారణ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు.

నేను ఏ తప్పూ చేయలేదు: డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

తాను ఏ తప్పూ చేయలేదని డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మొదటి రోజు విచారణ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ లోకల్ కమిటీ తనను విచారణకు పిలిచారని, జరిగింది, జరిగినట్లు వారికి చెప్పానన్నారు. 30 ఏళ్ల తన ఉద్యోగ జీవితంలో ఎలాంటి మచ్చా లేదని, 1994లో తాను అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించానని, ఈ ముప్పై ఏళ్లలో తనపై ఎలాంటి సివిల్, క్రిమినల్, ఏసీబీ కేసులుగానీ, డిపార్ట్‌మెంట్ పరంగా చార్జ్ మెమోలుగానీ లేవన్నారు. బాపట్ల, శ్రీకాకుళం జిల్లాల్లో కేసులు ఉన్నాయని ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేశారని, ఎక్కడ కేసులు ఉన్నాయో రుజువు చేయాలన్నారు. అలా ఉంటే తనకు ఎందుకు పదోన్నతి కల్పిస్తారని ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


చందూ మృతదేహం

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిపై వల్లూరు మండల పరిధిలోని రామిరెడ్డి కొట్టాలు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని అక్కదేవతల కాలనీకి చెందిన చందూ (18) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు అక్కదేవతల కాలనీకి చెందిన చందూ అదే కాలనీకి చెందిన రఘునాథ్, బాలు అనే మరో ఇద్దరు యువకులతో కలిసి కడప నగరానికి ఆధార్ కార్డు పని నిమిత్తం వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. రామిరెడ్డి కొట్టాలు సమీపంలో గొర్రె అడ్డు రావడంతో వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పింది. దీంతో బైక్ వెనుక వైపున కూర్చున్న చందూ ఒక పక్కకు ఒరిగిపోయాడు. అదే సమయంలో శాటిలైట్ సిటీకి చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తి తోళ్ల గంగనపల్లె వైపు నుంచి బైక్‌పై ఇంటికి వెళుతూ వారు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చందూ తల నుజ్జు నజ్జుగా మారి తీవ్ర రక్త స్రావమైంది. తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కమలాపురం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయండి

అధికారులకు జేసీ అదితి సింగ్ ఆదేశం


ఎండీయూ ఆపరేటర్‌తో మాట్లాడుతున్న జేసీ అదితి సింగ్

సాక్షి ఎఫెక్ట్..

వేంపల్లె : మండలంలో రేషన్ కార్డుల లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. సాక్షి దినపత్రికలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తూకాలు సక్రమంగా ఇవ్వలేదని వరుస కథనాలు రావడంతో బుధవారం వేంపల్లెలో ఉన్న పౌరసరఫరాల శాఖ గోడౌన్‌ను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ హరినాథ్ రెడ్డి, సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్‌లతో కలిసి స్టాకు వివరాలను పరిశీలించారు. సంబంధిత వివరాలను గోడౌన్ల డీటీ శివశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని అందించే ఎండీయూ ఆపరేటర్లకు తూకాలు సక్రమంగా ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అందించే రేషన్‌ను డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తూకాలు తక్కువ ఇస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. మరోసారి సక్రమంగా తూకాలు ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం చింతలమడుగుపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ప్రభుత్వం ద్వారా అందుతున్న బియ్యం సక్రమంగా సరఫరా అవుతుందా, లేదా అని హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. అలాగే వేంపల్లె మండలం కత్తులూరు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద భూమి రీసర్వే చేస్తున్న క్రమంలో జేసీ పరిశీలించి గ్రామీణ ప్రాంతాల్లో రైతుల మధ్య గొడవలు జరగకుండా సక్రమంగా సర్వే నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లోకేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థలం కొనుగోలు అగ్రిమెంట్ ఉన్నా ఎస్‌ఐ బెదిరిస్తున్నారు

బ్రహ్మంగారిమఠం : స్థలం కొనుగోలు చేసినట్లు తన వద్ద అగ్రిమెంట్ పత్రాలు ఉన్నా ఎస్‌ఐ బెదిరిస్తున్నారని గంగిరెడ్డి అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని మల్లేపల్లె పంచాయతీ పరిధిలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన భూమిరెడ్డి గంగిరెడ్డి అదే గ్రామానికి చెందిన సంటిరెడ్డి వద్ద 1993లో గ్రామంలోని 80/1ఏలో 8 సెంట్లు స్థలం కొన్నాడు. అప్పట్లో అగ్రిమెంట్ రాయించుకుని ఆ స్థలంలో గంగిరెడ్డి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లను ఉంచుకుంటున్నాడు. 20 ఏళ్ల క్రితం సంటిరెడ్డి మృతి చెందాడు. సంటిరెడ్డి భార్య వెంకటసుబ్బమ్మ, ఇద్దరు కుమారులు గ్రామంలోనే ఉంటున్నారు. ఇప్పటి వరకూ ఆ స్థలంపై వారు ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు. టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామంలోని కొంత మంది టీడీపీ నాయకుల సహకారంతో స్థలం తమది, తమకు కావాలంటూ మంగళవారం బ్రహ్మంగారిమఠం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ స్థలం కొనుగోలు చేసిన గంగిరెడ్డిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి అతని వద్ద ఉన్న ఆధారాలు చూపించాలన్నారు. దీంతో గంగిరెడ్డి తన వద్ద ఉన్న కొనుగోలు అగ్రిమెంట్ పత్రాలు ఎస్‌ఐకి చూపించారు. అయితే అగ్రిమెంట్లు తన దగ్గర చెల్లవంటూ ఎస్‌ఐ సంటిరెడ్డి కుటుంబీకులకు అనుకూలంగా మాట్లాడుతూ తనకు బయటకు పంపేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్‌ను బుధవారం గంగిరెడ్డి ఆశ్రయించాడు. పరిశీలించి న్యాయం చేస్తామని సీఐ హామీ ఇచ్చారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం


కాలిపోయిన బీరువాలోని వస్తువులు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని త్యాగరాజ కాలనీలో మంగళవారం రాత్రి ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ ప్రమాదం చోటు చేసుకుంది. త్యాగరాజ కాలనీకి చెందిన వనిపెంట వెంకటసుబ్బమ్మ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేది. మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగడంతో భయంతో పిల్లలతో కలిసి బయటికి వచ్చేసింది. కొద్ది క్షణాల్లోనే మంటలు పూర్తిగా వ్యాపించి ఇంట్లోని ఎలక్ట్రిక్ సామాన్లు, గృహోపకరణాలతో పాటు త్వరలో జరగనున్న మనమరాలి పెళ్లి కోసం బీరువాలో భద్రపరుచుకుని ఉన్న పట్టుచీరలు, బంగారు ఆభరణాలు, కొంత నగదు కాలి బూడిదయ్యాయి. చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామాగ్రి అంతా కాలి బూడిదైంది. దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న చిన్నయ్య

జమ్మలమడుగు రూరల్ : భార్య కాపురానికి రాలేదని చిన్నయ్య (37) అనే వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జమ్మలమడుగు మండలంలో జరిగింది. పట్టణ సీఐ ఎస్. లింగప్ప కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చిన్నయ్య డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య వరలక్ష్మి, బిడ్డలను పోషించుకునేవాడు. ఇటీవల వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భార్య పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లింది. దీంతో అతను మద్యానికి బానిస అయ్యాడు. భార్యను పలుమార్లు పిలిచినా ఆమె రాకపోవడంతో మనస్తాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చౌడేశ్వరి ఆలయంలో చోరీ

పట్టణంలోని నాగులకట్ట వీధిలో ఉన్న శ్రీ చౌడేశ్వరి ఆలయంలో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. పూజలు నిర్వహించిన అనంతరం అర్చకుడు తలుపులు వేయకుండా బయటకు వెళ్లాడు. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి వెండి శఠగోపం, 4 వెండి హస్తాలు, 2 తాళిబొట్లు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ పెద్దలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

బైకుపై ఎక్కించుకుని దోపిడీ


బాధితుడు పడిగపాటి శివరామిరెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన పడిగపాటి శివరామిరెడ్డిని నమ్మించి బైకుపై ఎక్కించుకొని దోపిడి చేసి బంగారు ఉంగరం, సెల్ ఫోన్ దొంగిలించిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ విషయంపై ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్ బాబు తెలిపిన వివరాల మేరకు..పోట్లదుర్తి గ్రామానికి చెందిన పడిగపాటి శివరామిరెడ్డి పోట్లదుర్తి రోడ్డుపై నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైకుపై వచ్చి తాను కూడా అటు వైపు వెళ్తున్నానని చెప్పి నమ్మించి శివరామిరెడ్డిని బైకుపై ఎక్కించుకున్నాడు. బైకును హనుమనగుత్తి గ్రామ సమీపంలోని విశాలమైన ప్రదేశంలోకి తీసుకెళ్లి బెదిరించి శివరామిరెడ్డి వద్ద ఉన్న అర్ధతులం బంగారు ఉంగరం, కీప్యాడ్ సెల్‌ను లాక్కుని వెళ్లాడు. వెంటనే బాధితుడు రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు.

విద్యుత్ షాక్‌తో చిరుత మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన చిరుత పులి


రైతును విచారిస్తున్న ఫారెస్ట్ అధికారి

సింహాద్రిపురం/లింగాల : విద్యుత్ షాక్‌తో చిరుత పులి మృతి చెందిన విషయాన్ని గోప్యంగా ఉంచిన రైతుపై కేసు నమోదు చేసినట్లు ప్రొద్దుటూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అశోక్ కుమార్, సబ్ డీఎఫ్ఓ దివాకర్ తెలిపారు. అధికారులు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రిపురం మండలం బలపనూరు – రామాపురం రోడ్డులో 'చిరుత పిల్లల సంచారం.. భయాందోళనలో రైతులు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసులు, మహబూబ్ బాషాలు సంఘటనా స్థలంలో వాటి తాలూకు కాలి గుర్తులను సేకరించి అవి జంగిల్ పిల్లి అనే పిల్లి జాతికి చెందినవని రైతులకు తెలిపారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న లింగాల మండలం రామాపురానికి చెందిన దేవిరెడ్డి భరత్‌రెడ్డి అనే రైతు బి.కొత్తపల్లి – రామాపురం సరిహద్దుల్లో ఉన్న అరటి పంటను అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు పొలం చుట్టూ వేసిన విద్యుత్ కంచెకు తగిలి చిరుత పులి మృతి చెందిందని తెలిపాడు. దాన్ని లింగాల మండలం కామసముద్రం గుట్టలో పూడ్చినట్టు అధికారులకు తెలిపాడు. దీంతో హుటాహుటిన వారు పూడ్చిపెట్టిన కళేబరాన్ని వెలికి తీయగా అది మగ చిరుత పులి అని నిర్ధారించి ఉన్నతాధికారులకు తెలిపారు. అక్కడే చిరుత పులికి పంచనామా నిర్వహించారు. పులి మృతదేహాన్ని అక్కడే పూడ్చేసిన రైతు భరత్‌రెడ్డిని అరెస్టు చేసి ప్రొద్దుటూరు ఫారెస్ట్ ఆఫీస్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి గురువారం కోర్టుకు హాజరు పరుస్తామని ఫారెస్టు అధికారులు తెలిపారు.

చట్టాలపై అవగాహన

కడప అర్బన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పలు చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కడపలోని న్యాయ సేవా సదన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) బాలల సంరక్షణ, బాల్య వివాహాల నిషేధం, ఉచిత నిర్బంధ విద్య, లైంగిక నేరాల నుంచి పిల్లల సంరక్షణ తదితర చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ శ్రీ కృష్ణ కిషోర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.41,55,000 కరోనా డబ్బులు మింగేశాడు

– బాధిత కార్మికుల ఆవేదన


కడప కార్పొరేషన్ : కోవిడ్–19, 20, 21 సంవత్సరాలలో కరోనాతో మృతి చెందిన వారికి దహన సంస్కారాలు చేసినందుకు ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంలో తమకు మంజూరైన డబ్బును వడ్లపల్లి చిన్నయ్య అనే కార్మికుడు వాడుకున్నాడని మాసాపేటకు చెందిన టి.రాజా, ఎం. ఆంథోని, గోసాల రాజు, టి. యాకోబు, కె. జాన్, గున్నా గోవిందు, కొండయ్య, ఎం. శాంతికుమార్ ఆరోపించారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట వారు మీడియాతో మాట్లాడుతూ తాము కడప నగరపాలక సంస్థలో మున్సిపల్ వర్కర్లుగా పనిచేస్తూ రిమ్స్‌లో కూడా విధులు నిర్వహించేవారమన్నారు. కోవిడ్–2020లో కరోనా వల్ల నగరంలో చాలామంది చనిపోయారని, వారి కుటుంబ సభ్యులు ఎవరూ రానందున ప్రభుత్వమే ఆ మృతదేహాలకు దహన సంస్కారాలు చేయాల్సి వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ పనిని వడ్లపల్లి చిన్నయ్య ఆధ్వర్యంలో తమకు అప్పగించారన్నారు. ప్రభుత్వం ఒక్కో మృతుడికి దహన సంస్కారాలు చేసేందుకు రూ. 15,000 చొప్పున మంజూరు చేసిందన్నారు. ఆ ఏడాది సుమారు 100 కరోనా మృతదేహాలను ఖననం చేశామన్నారు. ఈ మేరకు బిల్లులు తయారు చేసి, ప్రభుత్వానికి నివేదించి మంజూరైన నిధులను చెన్నయ్య ఖాతాలో వేయించి అందరం సమానంగా పంచుకునే వారమన్నారు. 2021వ సంవత్సరంలో కూడా రెండో విడత కరోనా వచ్చినప్పుడు దాదాపు 200పైగా కరోనా మృతదేహాలకు దహన సంస్కారాలు చేశామన్నారు. మంజూరైన రూ.41,55,000లను ఎప్పటిలాగే వి. చిన్నయ్య అకౌంట్‌లో వేయించామని, కానీ ఆ వ్యక్తి ఈ సారి ఎవరికీ పంచకుండా అందరి మొత్తాన్ని వాడుకుని తమకు అన్యాయం చేశాడన్నారు. ఈ విషయంపై రిమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసుల వద్ద డబ్బు ఇస్తానని రాతమూలకంగా రాయించి ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. చిన్నయ్య వద్దనుంచి డబ్బు ఇప్పించి న్యాయం చేయాలని వారు కోరారు.

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు


నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ ప్రవీణ్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని టి.చౌదరివారిపల్లె గ్రామంలో 25 మంది రైతులు ఖాజీపేటకు చెందిన పుత్తా ట్రేడర్స్‌లో ఆర్‌ఎన్‌ఆర్–15048 రకం వరి విత్తనాలను కొనుగోలు చేసి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 200 ఎకరాల్లో పంట సాగు చేయగా 20 రోజుల్లో వెన్ను రావడంతో వీరు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం స్థానిక మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌ను సంప్రదించారు. దీంతో ఆయన నకిలీ విత్తనాలతో సాగైన వరి పైర్లను పరిశీలించారు. అయితే రైతులు ఇప్పటికే సాగు కోసం రూ.30వేలు ఖర్చు చేశామని వెన్ను 20 రోజుల్లోనే వస్తుండంతో పంట దక్కదని ఏఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఏఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాస్త్రవేత్తలతో పరిశీలన చేయించి దీనిపై విచారణ చేయిస్తామన్నారు.

ఐదెకరాల్లో సాగు చేశాను



పుత్తా ట్రేడర్స్ దుకాణంలో ఆర్‌ఎన్‌ఆర్ రకం విత్తనాలను కొనుగోలు చేశాను. ఇప్పటికే వరి సాగు కోసం రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టాను. వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లేదు. అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో సాగు చేశాను. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇప్పించాలి. – పెద్ద వీరారెడ్డి, బాధిత రైతు, చౌదరివారిపల్లె గ్రామం

కంపెనీ విత్తనాలు అనుకుని మోసపోయాం



నాకున్న 4 ఎకరాల పొలంలో వరి సాగు చేశాను. 20 రోజులకే వెన్ను రావడంతో పంట వస్తుందా లేదా అనే సందేహంలో ఉన్నా. ఇప్పటికే రూ.1.20 లక్షలు సాగు కోసం ఖర్చు అయింది. పంట రాకపోతే తీవ్రంగా నష్టపోతా. వ్యవసాయాధికారులు కంపెనీ వారిపై చర్యలు తీసుకోవాలి. – వీరారెడ్డి, బాధిత రైతు, చౌదరివారిపల్లె

ఇన్సూరెన్స్ చట్ట సవరణ బిల్లు యోచన విరమించుకోవాలి


కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : ప్రపంచ స్థాయి పనితీరు కనబరుస్తున్న ఎల్‌ఐసీ ఉండగా, దేశంలోకి దివాలా తీసిన విదేశీ బీమా కంపెనీలను అనుమతించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించడం బాధ్యతారాహిత్యమని డాక్టర్ ఓబుల్ రెడ్డి, సిటిజన్స్ ఫోరం కార్యదర్శి లక్ష్మీరాజా, శ్రామిక మహిళా కన్వీనర్ సుబ్బమ్మ, బ్యాంకు ఉద్యోగుల కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, పెన్షనర్స్ రాష్ట్ర నాయకుడు నాగమునిరెడ్డి, సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి అన్నారు. కడప నాగరాజుపేట డీసీసీ బ్యాంకు సమీపంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలో దివాలా తీసి, అమెరికన్ ప్రభుత్వం గట్టెక్కించిన ఏఐఏ, లెహమాన్ బ్రదర్స్ కంపెనీలు దేశంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవాల్సి ఉందని అన్నారు. పాలసీదారుల ప్రయోజనాల కోసం జీఎస్టీ తొలగించాలని, జీవిత బీమా ప్రీమియంలకు ప్రత్యేక పన్ను రాయితీ ఇవ్వాలని, ఎల్‌ఐసీ సంస్థకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని 400 మంది పార్లమెంట్ సభ్యులు సిఫారసు చేస్తే ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. వివిధ సంఘాల నాయకులు అవధానం శ్రీనివాస్, అక్బర్ బాషా, వసుప్రద, రామాంజనేయులు, సుధీకర్, శ్రీనివాసులు, నిత్యానంద రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.